దళారులు లేకుండా ధాన్యం కొనుగోలు

- సీఎం జగన్ ఘనతే
- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



అసైన్డ్ భూ పట్టాలు అందిస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ

పెదపాడు : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు పక్షపాతి అని ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కొనియాడారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పేద, బడుగు, బలహీన వర్గాలతో పాటు రైతులకు అనేక పథకాలను అమలు చేస్తున్నారని వివరించారు. పెదపాడు మండలం కొత్తముప్పర్రు, పాతముప్పర్రు, వీరమ్మకుంట గ్రామాల్లో ఆయన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీలతో కలిసి మంగళవారం రెండో రోజు ప్రజా ఆశీర్వాదయాత్ర నిర్వహించారు. కొత్తముప్పర్రు గ్రామంలో జీజీఎంపీ రూ.15 లక్షలు, మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. వెంకటాపురంలో సీసీ రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పాతముప్పర్రు మహిళలకు గ్రామంలోని అసైన్డ్ భూములకు సంబంధించిన పట్టాలను అందజేశారు.

ప్రజా సమస్యలపై ఆరా

తొలుత ప్రజల పెద్ద ఎత్తున అబ్బయ్యచౌదరికి ఘన స్వాగతం పలికారు. నాయకులపై ప్రజలు పూల వర్షం కురిపించారు. మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాదయాత్రగా ప్రజల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకుంటున్నారు. డ్రెయినేజీలు అభివృద్ధి చేయాలని మహిళలు కోరారు. కార్యక్రమంలో కోట గోవర్దన్, మెడబలిమి సంతోష్ కుమార్, గ్రామ సర్పంచ్ మరడాన చంటిబాబు, ఎంపీటీసీ సభ్యుడు పూడి అప్పలస్వామి, వడ్డి కార్పొరేషన్ చైర్మన్ ముంగర సంజీవ్‌కుమార్, ఏఎంసీ అధ్యక్షుడు అప్పన ప్రసాద్, ఎంపీపీ బత్తుల రత్న కుమారి, బీసీ సెల్ అధ్యక్షుడు ఘంటా ప్రసాదరావు, జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్ చౌదరి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు తేరా ఆనంద్, పెదపాడు, గోగుంట సొసైటీల అధ్యక్షులు అక్కినేని రాజశేఖర్, భావరాజు సత్యనారాయణ, సీనియర్ నాయకుడు గారపాటి భాస్కరరావు, పెనుమత్స శ్రీనివాసరాజు, గొట్టాపు నర్సింహ రావు, కొత్తముప్పర్రు ఎంపీటీసీ కర్రె అనీల్, వనం నర్సింహమూర్తి, పాతముప్పర్రు సర్పంచ్ మెడబలిమి స్వరూపరాణి, బత్తుల ఏసురాజు, ఇళ్లారు విజయ్, కొండేలాజరు, కంభంపాటి సుబ్రహ్మణం, రాజుపేట సర్పంచ్ తొందురు క్రాంతికుమార్, పూడిరంగ అప్పారావు, మాజీ సర్పంచ్ దాసరి పెదబాబు, గుణుపూరు మహేష్, జయపురం గ్రామ సర్పంచ్ ఘంటసాల బేబీ సరోజ, మాజీ ఎంపీటీసీ ఘంటసాల మోషే, జయమంగళ బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ధ్యేయం

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ రైతులు దళారుల భారిన పడకుండా నేరుగా రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి, ధాన్యం డబ్బులు వారి ఖాతాల్లోనే వారంలోపుగా అందిస్తున్న ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు పరిహారం గతంలో ఏడాది లేదా రెండేళ్లకో అరకొర అందిస్తే.. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెల రోజుల్లోనే ఇన్‌పుట్ సబ్సిడీ అందిస్తున్నామని వివరించారు. వైఎస్సార్ సున్నా వడ్డీ పథకం ద్వారా రైతులకు పంట రుణాలు, వైఎస్సార్ రైతు భరోసా పథకంలో రూ13,500, ఉచితంగా పంటల బీమా, వ్యవసాయ ఉచిత విద్యుత్, ఆక్వా రైతులకు విద్యుత్ సబ్సిడీ, వైఎస్సార్ యంత్ర సేవా పథకం ద్వారా ట్రాక్టర్లు, వ్యవసాయ పనిముట్లు, సబ్సిడీపై విత్తనాలు, స్థానికంగానే అందుబాటులో ఎరువులు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ మాత్రమేనని చెప్పారు.



పాతముప్పర్రులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ప్రజాప్రతినిధులు

క్లుప్తంగా

ట్యాబ్‌ల పంపిణీ



గోపన్నపాలెం హైస్కూల్లో విద్యార్థినికి ట్యాబ్ అందిస్తున్న ప్రజాప్రతినిధులు

దెందులూరు: ప్రభుత్వం విద్యాభివృద్ధి, ఉన్నత విద్యే లక్ష్యంగా ఇస్తున్న ట్యాబ్‌లను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రామ సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ అధ్యక్షుడు ఏనుగు రామాంజనేయులు కోరారు. మంగళవారం గోపన్నపాలెం ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం మరీదు మనోహర్ అధ్యక్షతన ఎనిమిదో తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు ఏనుగు అంజలి ప్రసాద్, సువ్వా ప్రభుదాసు, నాయకులు కొండేటి గంగాధర్, కొండేటి హనుమంతు, మోర్ల సుబ్బారావు, తోట పద్మారావు, పసుమర్తి శ్రీనివాస్, మాగంటి కృష్ణమోహన్, వార్డు మెంబర్లు, సచివాలయ ఉద్యోగులున్నారు.

పింఛన్ల పంపిణీ



పోతునూరులో తరగళ్ల రామకృష్ణకు కొత్త పింఛను అందిస్తున్న ప్రజాప్రతినిధులు

దెందులూరు: మండలంలోని పోతునూరు గ్రామంలో తరగళ్ల రామకృష్ణకు మంజూరైన వృద్ధాప్య పింఛన్ నగదును మంగళవారం గ్రామ సచివాలయంలో సర్పంచ్ బోదుల స్వరూప్, ఎంపీటీసీ సున్నా నరేష్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి, సీఎం జగన్‌మోహన్‌రెడ్డిలకు రేషన్ డీలర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు తలారి రామకృష్ణ, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి సున్నా ఫణీంద్ర, నాయకులు బత్రాజు సత్యనారాయణ కృతజ్ఞతలు తెలిపారు.

24న శిథిల రామాలయం తొలగింపు



గంగన్నగూడెం శిథిలావస్థకు చేరిన పట్టాభిరామాలయం

దెందులూరు: గంగన్నగూడెంలో శిథిలావస్థకు చేరిన 1955లో నిర్మించిన శ్రీ పట్టాభి రామాలయ స్థానంలో రూ.2 కోట్లతో నూతన ఆలయాన్ని నిర్మించనున్నట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు పాకలపాటి మురళీకృష్ణ, కార్యదర్శి త్రిపురనేని అమర్‌చంద్, గ్రామ పెద్దలు ఇరుకులపాటి సాంబశివరావు తెలిపారు. మంగళవారం గంగన్నగూడెంలో వారు మాట్లాడుతూ ఈ నెల 24న శ్రీ పట్టాభి రామాలయాన్ని తొలగిస్తామన్నారు. గ్రామస్తుల సహకారం రూ.2 కోట్లతో నూతన నిర్మాణానికి ఫిబ్రవరి 9న శంకుస్థాపన చేస్తామని చందనా కర్త గుడిగుంట లక్ష్మీనారాయణ చెప్పారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి



దెందులూరులో రాజకీయ నాయకుల సమావేశం

దెందులూరు: భారత ఎన్నికల సంఘం ఆదేశాలు పాటించాలని ఈఆర్వో, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సత్యనారాయణ అన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ ఎన్వీ నాంచారయ్య ఆధ్వర్యంలో రాజకీయ నాయకులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. 2024 దెందులూరు నియోజకవర్గ ఓటర్ల తుది జాబితాను అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులకు అందజేశారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి, పార్టీ పెదవేగి మండల అధ్యక్షులు జానంపేట బాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు బొద్దు సతీష్, బీజేపీ నాయకులు గోపాల్, కమ్యూనిస్టు నాయకులు బలగం అప్పారావు, శ్రీనివాసరావు, తహసీల్దార్లు విజయ్‌కుమార్, నాగరాజు, ఎన్వీ నాంచారయ్య, స్పెషల్ డిప్యూటీ ఎలక్షన్ తహసీల్దార్ నాగేశ్వరరావు ఉన్నారు.

నేడు ప్రజా ఆశీర్వాద యాత్ర ఇలా..

పెదపాడు : ఎమ్మెల్యే కొఠారి అబ్బయ్యచౌదరి ప్రజా ఆశీర్వాద యాత్ర మూడో రోజు బుధవారం పెదపాడులోని రామచంద్రపురం నుంచి ఎస్సీ ఏరియా, కేఆర్‌పాలెం, తెలగాలపేట, దక్షిణ వీధి, శాలిపేట గండిచెరువు గట్టు మీదుగా నాయుడుగూడెం గ్రామం చేరుకుంటుందని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అప్పన ప్రసాద్ తెలిపారు. పార్టీ శ్రేణులు, ప్రజాప్రతినిధులు, అభిమానులంతా పాల్గొనాలని ఆయన కోరారు.

తెరుచుకున్న అంగన్‌వాడీ కేంద్రాలు



గుండుగొలను అంగన్‌వాడీ కేంద్రంలో విద్యాబోధన చేస్తున్న అంగన్‌వాడీ రాజామణి

భీమడోలు: రాష్ట్ర ప్రభుత్వ హామీతో 42 రోజుల తర్వాత అంగన్‌వాడీలు సమ్మె విరమించి విధులకు మంగళవారం హాజరయ్యారు. అంగన్‌వాడీ కేంద్రాలు తెరుచుకున్నాయి. భీమడోలు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలో భీమడోలు, ఉంగుటూరు, నిడమర్రు మండలాల్లో 196 కేంద్రాలుండగా సమ్మె విరమణకు ముందుగానే 14 కేంద్రాల్లోని 28 మంది వర్కర్లు, హెల్పర్లు విధుల్లో చేరారు. ఆ కేంద్రాలు కొన్ని రోజులుగా చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, యువతులకు సేవలు కొనసాగుతున్నాయి. గుండుగొలనులోని అంగన్‌వాడీ కార్యకర్త బి.రాజామణి మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై పూర్తి నమ్మకం ఉందని, అందుకే ఈనెల 18న సమ్మె విరమించి విధుల్లో చేరారని, అంగన్‌వాడీ కేంద్రానికి 14 మంది చిన్నారులు వస్తున్నారని చెప్పారు. మిలిగిన 182 కేంద్రాలన్నీ మంగళవారం తెరుచుకున్నాయని సంబంధిత అధికారులు తెలిపారు.

విధుల్లో చేరిన అంగన్‌వాడీలు

దెందులూరు: మండలంలో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు విధుల్లో చేరారు. గత 42 రోజులుగా సమ్మెలో ఉన్న వారు మంగళవారం అంగన్‌వాడీ కేంద్రాలకెళ్లి సెల్ఫీ దిగి, విధుల్లో చేరామని ప్రభుత్వానికి ఫొటోలు పంపారు. దెందులూరు సెక్టార్ సూపర్‌వైజర్ శ్రీదేవి అన్ని కేంద్రాలను పరిశీలించారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలను విజయవంతం చేద్దాం



దెందులూరు : సమీక్ష నిర్వహిస్తున్న ప్రత్యేకాధికారి డీపీఓ శ్రీనివాస్ విశ్వనాథ్

దెందులూరు: ఆడుదాం - ఆంధ్ర దెందులూరు నియోజకవర్గ స్థాయి పోటీల విజయవంతానికి కృషి చేయాలని నియోజకవర్గ ప్రత్యేకాధికారి, డీపీఓ తూతిక శ్రీనివాస విశ్వనాథ్ కోరారు. ఈ పోటీల ఏర్పాట్లపై మంగళవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో ఎంపీడీఓ శ్రీలత, నియోజకవర్గ ఆడుదాం - ఆంధ్ర కోఆర్డినేటర్ రాజ్ గోపాల్ ఆధ్వర్యంలో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ శ్రీలత, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజ్‌గోపాల్ మాట్లాడుతూ నియోజకవర్గ ఆడుదాం - ఆంధ్ర పోటీల్లో ఐదు ఆటలకు 20 పురుష, 20 మహిళల జట్లు అర్హత సాధించాయన్నారు. ఈ పోటీల నిర్వహణకు మండలాల్లోన్ని పీఈటీలు, గ్రామ కార్యదర్శులకు డ్యూటీలు వేశామని తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, ఎంపీడీఓలు శ్రీలత, రాజ్‌మనోజ్‌లను కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ మోర్ల సుబ్బారావు, నియోజకవర్గ కోఆర్డినేటర్ రాజ్‌గోపాల్ సత్కరించారు.

చిరుధాన్యాల సాగు లాభదాయకం



రైతు శిక్షణలో మాట్లాడుతున్న డాక్టర్ భరత్‌లక్ష్మి

దెందులూరు/పెదవేగి: ప్రస్తుత పంటలకు ప్రత్యామ్నాయంగా చిరుధాన్యాల సాగు చేసుకోవాలని మార్టేరు ప్రాంతీయ పరిశోధనా స్థానం సైంటిస్టు డాక్టర్ ఎం భరత్‌లక్ష్మి రైతులకు సూచించారు. మంగళవారం పెదవేగి మండలం పెదకడిమి రైతు భరోసా కేంద్రంలో ఎరువాక కేంద్రం, వ్యవసాయ శాఖ, ఆచార్య వ్యవసాయరంగా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో డాక్టర్ భరత్‌లక్ష్మి వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ వై.రామకృష్ణ, ప్రధాన శాస్త్రవేత్త పి.మణిరత్నం మాట్లాడుతూ చిరుధాన్యాల సాగుతో మంచి దిగుబడులు సాధించవచ్చన్నారు. భూమి నాణ్యత స్థిరంగా ఉంటుందన్నారు. చిరుధాన్యాల వల్ల కలిగే లాభాలను వివరించారు. సమావేశంలో శాస్త్రవేత్తలు ఐ.సుధీర్‌కుమార్, కె.ఫణికుమార్, నాగేంద్రబాబు, శ్రీదేవి, సుజాత, వ్యవసాయ శాఖ సిబ్బంది, ఎన్‌జీ రంగా విశ్వవిద్యాలయ సిబ్బంది, ఏరువాక సిబ్బంది పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే తెలపండి



రాజకీయ పక్షాలతో మాట్లాడుతున్న ఆర్డీఓ ఖాజావలి

నిడమర్రు: ఉంగుటూరు నియోజకవర్గంలోని 214 పోలింగ్ కేంద్రాల్లో ప్రకటించిన ఓటర్ల జాబితాలో అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలని ఏలూరు ఆర్డీఓ ఎన్‌ఎస్‌కే ఖాజావలి తెలిపారు. మంగళవారం నిడమర్రు తహసీల్దార్ కార్యాలయంలో ఉంగుటూరు నియోజకవర్గ స్థాయి అన్ని రాజకీయ ప్రజాప్రతినిధులు, నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీఓలతో ఉంగుటూరు ఎలక్ట్రోల్ రిజిస్ట్రేషన్ అధికారి హోదాలో ఆర్డీఓ ఖాజావలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని 214 పోలింగ్ కేంద్రాల్లో ప్రకటించిన తుది ఓటరు జాబితాలను ఆయా రాజకీయ పార్టీల నేతలు పరిశీలించుకోవాలని కోరారు. నియోజకవర్గంలో 1,01,152 మంది పురుషులు, 1,04,177 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్ 5 మందితో కలిపి మొత్తం 2,05,334 మంది ఓటర్లు ఉన్నట్టు చెప్పారు. మరో 197 మంది సర్వీసు ఓటర్లుగా తెలిపారు. అనంతరం నిడమర్రు గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అక్కడ జాబితాలు, సౌకర్యాలపై ఆరా తీశారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ బి.సాయిరాజు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

విద్యతోనే బాలికాభివృద్ధి సాధ్యం



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీసీడీఓ సూర్యచక్రవేణి, సర్పంచ్ సునీత

భీమడోలు: ఆడపిల్లలను రక్షించడం, వారిని చదివించడం ద్వారానే బాలికాభివృద్ధి సాధ్యమని డీసీడీఓ సూర్యచక్రవేణి అన్నారు. భీమడోలు గ్రామ పంచాయతీ కార్యాలయంలో మంగళవారం బేటీ పచావో, బేటీ పఢావో అనే కార్యక్రమంపై మహిళలు, యువతులకు సర్పంచ్ పాము సునీత అధ్యక్షత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన డీసీడీఓ సూర్యచక్రవేణి మాట్లాడుతూ ఆడపిల్లలపై లైంగిక వేధింపు నిరోధించేందుకు సమాజ భాగస్వామ్యం అవసరమన్నారు. తల్లిదండ్రులు తమ ఆడపిల్లను చదివించాలని, పిల్లల పెంపకంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమన్నారు. ఆడపిల్లల భద్రత, సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలను అమలు చేస్తుందని వివరించారు. ఆర్‌టీఈ చట్టం, జగనన్న గోరుముద్దం, పోష్టికాహారం అందించడం తదితర బృహత్తర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో దిశ వన్‌స్టాప్ నిర్మల, జిల్లా చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పాము మానసింగ్, సచివాలయ ఉద్యోగులు, మహిళలు పాల్గొన్నారు.

బాలల హక్కులు, చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న శ్రీకాంత్

దెందులూరు: జాతీయ బాలికా దినోత్సవం మంగళవారం శ్రీ శైనకుల కమ్యూనిటీ హాలులో నిర్వహించారు. కార్యక్రమంలో ఇనిస్టిట్యూషన్ కేర్ ఆఫీసర్ శ్రీకాంత్ మాట్లాడుతూ బాలల హక్కులు, చట్టాలను గ్రామస్తులకు వివరించారు. వన్‌స్టాప్ సెంటర్ అడ్మిన్ నిర్మల మాట్లాడుతూ స్త్రీ శిశు సంక్షేమ శాఖ తరపున ప్రతి జిల్లాలోనూ వన్‌స్టాఫ్ సెంటర్ నిర్వహిస్తామన్నారు. పంచాయతీ కార్యదర్శి సునీతారావు, విజయలక్ష్మి, డ్వాక్రా మహిళలు పాల్గొన్నారు.

'ఆడుదాం - ఆంధ్ర'కు తరలిరండి

ఉంగుటూరు: గణపవరం డిగ్రీ కాలేజీలో నిర్వహించే ఆడుదాం - ఆంధ్ర నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలను విజయవంతం చేయాలని ఎంపీడీఓ ప్రేమాన్విత కోరారు. మండల స్థాయిలో విజయం సాధించిన జట్లంతా తరలిరావాలన్నారు. ఈ పోటీలను ఎమ్మెల్యే వాసుబాబు ప్రారంభిస్తారని చెప్పారు.

27న ఏలూరు మండల పరిషత్ సమావేశం

ఏలూరు రూరల్: ఏలూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 27న ఉదయం 10 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో ప్రారంభమవుతుందని ఎంపీడీఓ బి.ప్రణవి తెలిపారు. ఎంపీపీ పెన్మెత్స శ్రీనివాసరాజు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో అభివృద్ధి పనులతో పాటు ప్రజా సమస్యలపై చర్చిస్తారని పేర్కొన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు, మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు.

ఉచిత వైద్య శిబిరం



నారాయణపురం చర్చిలో వైద్య పరీక్షలు చేస్తున్న దృశ్యం

ఉంగుటూరు: నారాయణపురంలో లవ్‌ఇన్ యాక్షన్ ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటుచేశారు. సాధారణ వ్యాధులకు పరీక్షలు నిర్వహించి, మందులు అందజేశారు. గుడ్ సమారిటన్ కాన్సర్ అండ్ మల్టీస్పెషాలిటి హాస్పిటల్ ఏలూరు వైద్యులు సేవలు అందించారు. కార్యక్రమంలో లవ్‌ఇన్ యాక్షన్ ప్రెసిడెంటు ఎస్ పాల్ దినకర్, ట్రెజరర్ ఎస్ అబ్నెర్, గ్రామపెద్ద యు.ముసలయ్య, వైఎస్సార్ సీపీ నాయకుడు యు.బుజంగరావు, కలపాల కుమార్ డేవిడ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య సురక్ష'తో ప్రజలకు భరోసా



గుండుగొలనులో మహిళ అనారోగ్య సమస్య తెలుసుకుంటున్న డాక్టర్ సునీత



రక్త పరీక్షలు చేస్తున్న వైద్యారోగ్య సిబ్బంది

భీమడోలు: ప్రతి ఒక్కరూ సంపూర్ణ ఆరోగ్యవంతులు ఉండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశమని, జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ప్రజల ఆరోగ్యానికి భరోసా ఏర్పడిందని ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి అన్నారు. గుండుగొలను గ్రామ సచివాలయం వద్ద మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎంపీడీఓ పద్మావతిదేవి ప్రారంభించారు. ఆరోగ్య సంరక్షణ, తదితర అంశాలపై భీమడోలు సీహెచ్‌సీ సూపరిండెంటెంట్ ఎస్.సునీత అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా 474 మంది సాధారణ, ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ కంటి వెలుగులో 249 మందికి కంటి పరీక్షలు చేశారు. వీరిలో వృద్ధులు 68 మంది ఉన్నారు. రక్త పరీక్షలు, ఈసీజీలు చేశారు. ఉచితంగా మందులు అందజేశారు. జనరల్ వైద్యులు కె.శ్రీలక్ష్మి, జాహ్నవి, ఆర్థోపెడిక్ లోకి కృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవోఆర్‌డీ ఎ.సుందరి, గ్రామకార్యదర్శి మురళి, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మహోన్నత వ్యక్తి నేతాజీ



భీమడోలులో నేతాజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజాప్రతినిధులు



భీమడోలు లైబ్రరీలో చంద్రబోస్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుధాకర్, చిన్నారులు

భీమడోలు: భారత స్వాతంత్య్ర సమరయోధుడు, జయంతి తప్ప వర్ధంతిలేని మహోన్నత వ్యక్తి నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని జెడ్పీటీసీ తుమ్మగుంట భవానీ, మండల సర్పంచుల చాంబర్ అధ్యక్షురాలు పాము సునీతలు పేర్కొన్నారు. భీమడోలులో వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు మద్దాల అప్పారావు ఆధ్వర్యంలో నేతాజీ 127వ జయంతి కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. బోస్ విగ్రహానికి వారు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్వాతంత్య్రోద్యమంలో చంద్రబోస్ కృషి చిరస్మరణీయమని, ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. నేతాజీ స్వాతంత్య్ర పోరాటంలో కీలకపాత్ర పోషించారన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటు చేసి యువతే దేశానికి వెన్నుముకని చాటిచెప్పారని గుర్తుచేశారు. కార్యక్రమంలో వివేకానంద యువజన సంఘం అధ్యక్షుడు సుతాపల్లి ప్రసాద్, చైతన్య యువజన సంఘం అధ్యక్షుడు డాక్టర్ పి.మాన్‌సింగ్, మండల ప్రధాన కార్యదర్శి రామకుర్తి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల యూత్ అధ్యక్షుడు మద్దుల రాజా, సొసైటీ డైరెక్టర్ కిలపర్తి భాస్కరరావు, పెద్దలు మంచెం నాగు, హిదయతుల్లా, ప్రదీప్, నాగభూషణం, పాఠశాలల చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

పోరాటయోధుడు చంద్రబోస్

దేశం గర్వించదగ్గ పోరాట యోధుడు సుభాష్ చంద్రబోస్ అని రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత మండే సుధాకర అన్నారు. భీమడోలు శాఖా గ్రంథాలయంలో గ్రంథపాలకుడు కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో మంగళవారం సాయంత్రం సుభాష్ చంద్రబోస్ 127వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మాలలు వేశారు. వివిధ పాఠశాలల చిన్నారులు, పెద్దలు నివాళులర్పించారు.

'వైఎస్సార్ ఆసరా'తో మహిళల ఆనందం

ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్



కోటగిరి శ్రీధర్, ఏలూరు ఎంపీ

దెందులూరు: జిల్లాలో 3,89,801 మంది డ్వాక్రా మహిళలకు నాలుగో విడత రూ.362.89 కోట్ల లబ్ధి చేకూరడంతోపాటు పూర్తిస్థాయిలో రుణమాఫీ అవ్వడం తనకెంతో సంతోషంగా ఉందని ఎంపీ కోటగిరి శ్రీధర్ అన్నారు. మంగళవారం రాత్రి తన కార్యాలయంలో ఎంపీ మాట్లాడుతూ 2019లో పాదయాత్రలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల రోజు వరకు అక్కచెల్లెమ్మలు తీసుకున్న డ్వాక్రా రుణాలు నాలుగు విడతల్లో రుణమాఫీ, సున్నా వడ్డీకే రుణం, వడ్డీ పూర్తిగా మన ప్రభుత్వమే కడుతుందని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఇచ్చిన మాట తప్పని, మడమ తిప్పని ప్రజానేతగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక డ్వాక్రా అక్కాచెల్లెమ్మల కోసం వైఎస్సార్ ఆసరా పథకం రూపొందించి అమలు చేశారని చెప్పారు. ఏలూరు జిల్లాలో చింతలపూడి, దెందులూరు, ఏలూరు, ద్వారకాతిరుమల, కైకలూరు, నూజివీడు, పోలవరం, ఉంగుటూరు నియోజకవర్గాల్లో 3,89,801 మంది డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేయడం, వారి కుటుంబాల్లో నేడు పర్వదినమని తెలిపారు. జిల్లాలో అక్కచెల్లెమ్మలందరి తరపున సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఎంపీ శ్రీధర్ కృతజ్ఞతలు తెలిపారు.

పీఆర్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ ఇంజనీర్స్ అసోసియేషన్ డైరీని మంగళవారం ఆవిష్కరించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ కె.కేదారేశ్వరరావు, ఈఈ ఎంపీ రమణమూర్తి, జేఏసీ చైర్మన్ చోడగిరి శ్రీనివాస్, ఉప్పలపాటి శ్రీనివాస్, వీరబాబు పాల్గొన్నారు.